కథనం ;

# ధూళిపులి

గోదావరి

అప్పటిదాకా నిర్విరామంగా తాపీఆడించిన తాపీమేస్త్రీ తాపీ గోడమీదపెట్టి నిలబడ్డాడు. మరోకమారు ఆ కట్టడాన్ని నాలుగు పక్కలనుంచి చూడాలనేతలంపు కలిగింది మేస్త్రీకి.... ఆ కట్టడానికి పదడుగులదూరంవెళ్లి బుర్రమీసాలు ఎడంచేత సవరించుకుంటూ ఎగాదిగాచూశాడు. సిమెంటు కలుపుతున్నవాళ్ళు, ఇటికలుమోస్తున్న వాళ్లు పనాపి మేస్త్రీచూపినట్టుగానే వాళ్లూచూశారు.... మేస్త్రీముఖంలో వెలుగు. కట్టడం తను అనుకున్నవిధంగానే వస్తున్నందుకు తృప్తిగా ఊపిరిపీల్చుకున్నాడు.

మళ్ళీ తాపీఅందుకున్నాడు.... "మాల్ మాల్.... అందుకోండి.... ఒరేయ్.... అగో అట్లాంటి సగంకాలిన ఇటికలుతేవద్దు. జెర కాలాడియ్యండ్లి.... లంజకొడుకులకు ఏ ఘడియల ఏబుద్ధిపుడుతదో ? ఆనకాలం.దెవుసం.... గింతపూర్తి జేస్తే...." మేస్త్రీ కూలీలను వేగిరపరుస్తున్నాడు. అతని మనసులో ముప్పయిఅడుగుల స్థూపం. దానిమీద తానురూపొందించబోయే ఇద్దరిరూపం అతనికళ్ళముందు కదులుతోంది.

"ఇది ఏబస్తీనుంచిచూసినా కనిపియ్యాలె.... వాళ్ళముఖాలల్లో సరిగ్గా మార్క్సిస్టు ఉపన్యాసం యిచ్చినప్పుడు చూసిన ఉద్వేగంఉండాలె" మేస్త్రీ అంతరంగంలో....

మేస్త్రీ ఇంతకుముందు వంకీలకట్టడాలు, పెద్దపెద్ద బిల్డింగులు కట్టాడు.... సిమెంటుకు ప్రాణంపోశాడు. లతలు, సింహాలు, దేవుళ్ళవిగ్రహాలు చాలాచాలాకట్టాడు.... కాని ఈ స్థూపం కడుతున్నప్పుడున్నంత ఉషారుగా ఎన్నడూలేడు.... పునాదులు తవ్విస్తున్న దగ్గరినుండి- ఒక్కొక్క-ఇటుక పేరుస్తున్నాకొద్ది అతను రాత్రి పగలు ఒకటేకలవరింత- ఈస్థూపం బస్తిబస్తికి కనిపియ్యాలే. తానురూపొందించబోయే అమరవీరులు తమబస్తీవాళ్ళే- చిన్నతనంనుండి వాళ్ళు ఎర్రజెండాఎత్తుకొని దుమ్ము రేగుతుండగా తమవాడలల్లో తిరిగిన దినాలు గుర్తుకుతెచ్చుకున్నాడు.... తను ఆ దుమ్ములో వాళ్ళెంట తిరిగినవాడే. వాళ్ళు ఉపన్యసిస్తుండగా వీధిలోనిలబడి ఆ మాటలువిన్నవాడే. వాళ్ల పోయినతరువాత వాళ్ళమాటలు మనసులో ఫోసెత్తేవి.

దాదాపు రెండుసంవత్సరాల తరువాత పైసా పైసా పోగుచేస్తే ఇప్పటికి తమ బస్తీవాళ్ళకోరిక ఫలించబోతోంది. మేస్త్రీకి గంగారాం తల్లి గుర్తొచ్చింది. గుడ్లనిండా నీళ్ల గుబగుబలాడగా రోజుకోమారువచ్చి తయారవుతున్న స్థూపందగ్గర కూలబడుతుంది.... పసిగుడ్డును తరిమినట్టు- ఆ ఇటుకపెల్లలను తడుముతుంది. పెద్ది

శంకర్ తండ్రి కాకీనెక్కరుతో నెత్తిమీద హెల్మెటుతో దూరంగా నిలబడి "మావోడు దేన్నైతేకోరిండో దేనికోసమైతే తన పానాలిచ్చిండో అదింకా మిగిలేఉన్నది". అంటున్నట్లుగానే మేస్త్రీకితోచింది.

వాళ్లిద్దరు తమనాయకులు.... వాళ్లిద్దరు తమకోసమే మరణించినవాళ్లు- వాళ్లు తమవాళ్లు- వాళ్లజ్ఞాపకాలను, తమమసిబారిన కళ్ళముందు- తమ పూరిగుడిసెలమధ్య మహోన్నతంగా నిలబెట్టుకోవాలని కలలుకన్న కార్మికులు వస్తూపోతూ స్థూపందగ్గర నిలబడి మరీ వెళ్లేవాళ్లు....

మేస్త్రీకి ఇట్లాంటి ఎన్నో సంగతులు జ్ఞాపకంవస్తున్నాయి.... ఆ స్థూపానికి ఇటుకలు మోసేవాళ్లు, సిమెంటు అందించేవాళ్లు వాళ్లందరికీ ఆ అమరవీరుల జ్ఞాపకాలున్నాయి....

స్థూపం లేచిపోతోంది.... పారలగరగర- ఇటుకలమీద తాపీదెబ్బ.... మేస్త్రీ గొణగుడు మొత్తానికి యమసందడిగానే ఉన్నది....

బహూశా సమయం రెండుదాటిఉండవచ్చు. స్థూపం సగబడలేచింది.... పని జోరుగా సాగుతోంది.... అలాంటిసమయంలో డిసిల్ జీబొచ్చి దూరంగాఆగింది.... అందులోనుండి నలుగురుపోలీసులు, ఒక యస్.ఐ. ఒక సర్కిల్ దిగారు. కర కర లాడే బొగ్గునెరుసులమీద తోలుబూట్లు టకటకలాడించుకుంటూ స్థూపందగ్గరిదాకా వచ్చారు.

"రాడికల్ నాకొడుకుల అరెస్టు చేయండి." సర్కిల్ ఊబిచెంపలు ఊగు, తుండగా....

"యే మాకేలాడోంకో పకడో" బక్కచెంపల కోతిముఖపు యస్.ఐ....

మేస్త్రీ విస్తుపోయాడు. కూలీలు పనాపి నిల్చొన్నారు.

"మేం రాడికల్లంగాదు మేషన్లం" మేస్త్రీ గొణిగిండు.

రెండేరెండు నిమిషాలు.... పోలీసులు కూలీలమీదపడ్డారు.... ఆడకూలీలను విడిచిపెట్టి కంటికి నజరుగకన్పించిన వారినల్లా ఏరుకొని జీపెక్కించారు.... మేస్త్రీని, మేస్త్రీపనిముట్లను, తట్టలను పారలను అరెస్టు చేశారు....

అందులో ఒక వయసుమళ్లిన పోలీసుకు పెద్దిశంకర్‌ను తొలిసారి అరెస్టుచేయడం గుర్తొచ్చింది.... 'ఆ స్థూపాన్ని అరెస్టుచేస్తే....' సర్కిల్‌కు చిత్రమైనఆలోచన వచ్చింది.... జీపు కదిలింది.... నల్లటిదుమ్ము రేగింది....

748

గుడిసెల్లనుండి బిలబిల జనం పరుగెత్తుకొచ్చారు.... సగంలేచిన స్థూపం.... కలిపినసిమెంటు- పేర్చిన ఇటుకలు....

"పనిఇసిరెలు పట్టుకపోయిండ్లు గాడ్దికొడుకులు.... కొడుకుల్లాలా మా రోజులత్తయి.... మీహోలర్ల- మీజీబుల- మీ తుపాకుల.... మీతూటుకొమ్ముల- మీకుర్సీల ఇర్సికట్టేయకుంటే నాపేరు ఏల్పుల బాలిగాడుగాదు...." ఓ కార్మికుడు వదురుతున్నాడు.

"ఇగో ఆల్లిల్లు కాముని పెంటగాను.... ఆళ్లమీదదుబ్బబడ.... లావుసెల్లిచ్చుకుంటండ్లు.... ఇగో మనరెక్కలున్నయి.... ఎట్లతీసుకపోతరోసూత్తాం.... అందరం కడుదాం.... మనకొడుకుల మనం నిలుపుకుందాం...." ఓ నల్లటిదొడ్డుట్నామె- చేతులారుస్తోంది....

సైకిళ్లు కిరకిరలాడాయి- బోకినోళ్లుతిట్టాయి.... గుడిసెలు గుసగుసలాడాయి. మొత్తానికి ఊరంతా వార్తగుప్పుమంది.... ఓరచూపులచూస్తూ కడక్‌కాకీగుడ్డలేసుకొని వాడవాడలా సి.ఆర్.పి. పోలీసులు గస్తీతిరిగారు....

*    *    *    *

చిమ్మెట్లుపలుకుతున్నాయి.... నీటిగుంటల్లో ఒకటి అర చిన్న కప్పలు అరుస్తున్నాయి.... ఆకాశం మసకేసిపోయింది. గుడ్డి చుక్కలు ఒకటీ అరా వెలిగిమలుగుతున్నాయి.... మబ్బుతెప్పలు కూడావిడిగా తిరుగుతున్నాయి.... వీధిలైట్లచుట్టు పేడపురుగులు తిరుగుతున్నాయి....గుడిసెలచుట్టు చీకటి గుసగుసలాడుతోంది అర్ధరాత్రి.. అలాంటి అర్ధరాత్రి.... తుపాకులుమోస్తూ తలలువంచుకొని కండ్లునులుపుకుంటూ గొణుక్కుంటూ దాదాపు రెండువందలమంది పోలీసులు స్థూపంచుట్టూ నిలుచున్నారు బారులుతీరి.... వాళ్లమధ్య యస్. పి. నిలుచున్నాడు.... చల్లటిగాలి తోలుతున్నా, అది వానకాలమైనా యస్.పికి చెమటలు కారుతున్నాయి. అతనిపక్క నలుగురైదుగురు అధికార్లు కిక్కురుమనకుండా నిలుచున్నారు....

"అందరూ వినండి.... వాళ్లు బతికుండగా ఈ ప్రాంతంలో ఎంత గడబిడ జరిగిందో మీకు తెలుసు.... ఈ స్థూపంపూర్తయితే- చచ్చినవాళ్లు మళ్ళీ బతుకుతారు. మనకంట్రోల్లో ఈఏరియా ఉండదు. సో- పదినిమిషాలల్లో దీన్నికూల్చెయ్యాలి...." యస్.పి ఇంగ్లీషులో బొంగురు గొంతుతో చెప్పాడు.... అప్పటికే అతడు అలిసిపోయాడు.... ఇంకా వాళ్లగురించి, వాళ్ల 'దురాగతాలు' గురించి చాలా చెప్పాలనుకున్నాడు.... కాని గొంతు పెకలలేదు.

749

"యస్. సర్." ఎవడో అధికారి కీచుగొంతుతో గొణిగి ఆచీకట్లోనే బూట్లు తాకించి సెల్యూట్ చేశాడు.

ఓకే ఒకనిమిషం.... పోలీసులు మాట్లాడలేదు.... బంగారం లాంటినిద్ర- ఈ ఘనకార్యం పగలు చేయకుండా ఇంతరాత్రి ఎందుకుచేయాలో అర్థంకాలేదు.... ఎవడో అధికారి కొందరిని తుపాకులతో కాపలాకాయమన్నాడు.... పోలీసుపనంటే తుపాకీ ఎక్కుపెట్టడం, పరేడ్ చేయడం, బాయేముడ్, దాయేముడ్‌లు.... కడక్‌బట్టలు గడ్డాలుగీసుకోవడం, బూట్లకుపాలిష్ రాసుకోవడం.... వీడు గడ్డపారలెత్తమంటండు. జోగుతూనే స్థూపాన్ని సమీపించారు. గడ్డపారలెత్తారు.... తవ్వబోతే భయం.... గోరీలల్లో దయ్యాలుంటాయి.... అసలే కమ్యూనిస్టులు.... తవ్వుతుంటే గుప్పి-గుప్పి-చప్పుడు.... పోలీసులకు చెమటలు కారుతున్నాయి....

పెళ్లలుకూలి కాళ్లమీదపడ్డాయి.... జబ్బలు తీపునంబెట్టాయి. ఒకడు గునపం పక్కవాడికాలుమీద పారేశాడు....

యస్.పి... సిగరెట్టుతాగుతూ జీపులో కూర్చున్నాడు- సిగరెట్టుపొగల నుండే సైగలుచేశాడు- లారీలొచ్చాయి. తిడుతూ గొణుగుతూ స్థూపాన్ని నేలమట్టం చేశారు.

"లోడ్ ది.లారీస్" యస్, పి.

కారిననెత్తురంత కడవల్లకెత్తినట్టు, చిందిననెత్తురంత పీపాలకెత్తినట్టు.... ఆ ఎర్రటి ఇటుకపెల్లలు, ఆ సిమెంటు తమముఖాలకు, తమ బట్టలకు అంటుతుండగా లారీలకెత్తారు.... లారీలు కదిలిపోయాయి.

ఊరుఊరంతా నిశ్శబ్దంగానేఉన్నది.... చుక్కలు కళ్లమూసుకున్నాయి. దిక్కుతోచని చిమ్మెట్లు అమరవీరులకు జోహార్లుపలుకుతూ ఎడతెరపిలేకుండా పలుకుతూనే ఉన్నాయి.

* * * *

తెల్లారింది.... స్థూపందగ్గరికి పరుగెత్తుకొచ్చిన తల్లి గుండెలుబాదుకున్నది.... చప్పిడి దవడలవాళ్లు, మసిబారిన ముఖాలవాళ్లు, దగ్గులోళ్లు, దమ్ములోళ్లు, హెల్మెట్ల వాళ్లు, చెమ్మాసులు భుజంమీద వేసుకొచ్చినవాళ్లు.... ఒపరేమిటి పిల్లాజెల్లా, ముసలీ ముతకా, స్త్రీలు అంతా కలబెనిగారు. తిట్టారు, ఏడ్చారు....

ఒక దమ్మురోగపు హేలర్‌మాన్ టొక్కటోపి తీసి మౌనంగా ఒకనిముషం నిలుచున్నాడు.... ఆతరువాత "ఇదేమన్న బాంబా? బత్తా? పేలిపోయి ఆళ్ల గు....ల

750

కింది కుర్చీలు కూలిపోవటానికి- ఆళ్లబంగ్లాలు గంగలకలువటానికి.... భయపడ్డరు బద్మాషి లంజకొడుకులు.... వారీ సూత్తండ్లారా ? వాళ్లకెంతభయమో " లొడలొడ వాగుతున్నాడు, తిడుతున్నాడు....

ఇంకొకడు ఎత్తుగడ్డమీద నిలబడి- "మనవీరులంటే ఎంతగుండెదడ.... ఒక్కొక్క ఇటుకపెల్ల దానికదే తిరగబడ్తదని జెనికిండ్లు- మన కామేర్డ్లు మన గుండెల్లో ఉన్నరు- అక్కడెట్లాతవ్వుతరు- మనహెల్మెట్లలో- మనచెమ్మాసుల్లో వాళ్లున్నరు "

మాట పూర్తి కాకుండానే ఇంకొక యువకుడందుకొని "పైసపైస కుప్పజేసుకున్నం- మనంఎర్రికోట కట్టాలనుకోలే- మనమేమి తాజ్‌మహల్ గట్టాలనుకోలే- మన దిక్కుమాల్న బతుకులు బాగుపడాల్నని పానానికి పానమిచ్చిన అన్నలకు స్థూపం గట్టాలనుకున్నం.... అదిబాంబయ్యింది.... భయపెట్టింది.... మనఅన్నలు మనందీసే బొగ్గుకుప్పల్లో అగ్గి.... రవులుకుంటరు...." ఇంకా ఏదోచెప్పబోయాడు.

ఒకస్త్రీ చేతులుతిప్పుతూ తిడుతోంది. వాళ్లకళ్లల్లో క్రోధం- వాళ్లకళ్లల్లో కసి. పిడికిళ్లు బిగుసుకున్నాయి.... మాటలు నినాదాలరూపం తీసుకున్నాయి.... నిలబడ్డ పాదాలు నేలనుగుద్దాయి....

ఇంతలోనే కాకీగుడ్డలు పరుగులెత్తాయి.... బూట్లు టకటకలాడాయి.... లాఠీలు లేచాయి....

జనం చెదిరిపోయారు.... వాడవాడలా కాగితాలు గోడలమీద ఎర్రెర్రగా.... వాడవాడలా వందలాదిపోలీసులు.... యస్. పి. పిచ్చెత్తినట్లుగా అరుస్తున్నాడు....

బొగ్గు రవులుకుంటోంది....

గుడిసెలు ప్లానులు రచిస్తున్నాయి.... వాళ్ళకుతెలుసు అమరవీరులునేర్పిన పోరాటం.... వాళ్లకుతెలుసు రగులుకోవడం.... వాళ్లకుతెలుసు అమరవీరుల లక్ష్యం.

ఎక్కుపెట్టిన తుపాకులమధ్య వాళ్లు ఆలోచిస్తున్నారు.... వాళ్లఆలోచనల్లో ఎర్రెర్రగా నిలిచిన అమరవీరులను ఎట్లాచెరుపగలడు యస్. పి....

స్థూపం కూల్చేసినా వాడవాడలా బొగ్గురగులుకోవడం ఎందుచేతనో యస్.పి.కి అర్థంకాలేదు....

751